
ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంఐఎం నేత ముక్తార్‌పాషా


ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మరోసారి ఆశీర్వదించండి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్


గొల్లపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సంక్షేమానికి పాటుపడే బీఆర్‌ఎస్ పార్టీకే ప్రజలంతా పట్టం కట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతూ.. బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడ నుంచి ప్రారంభమైన ఈ రోడ్‌షో హైదర్షాకోట్ పాత గ్రామం నుంచి పీరం చెరువు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలను తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఒక్కటేనన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు మరింత సుభిక్షంగా మారనున్నారన్నారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బొర్ర రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మావతిపాండు, అస్లాంబిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, నాయకులు నాగరాజు, వెంకట్‌రెడ్డి, గోపాల్‌ముదిరాజ్, పాపయ్యయాదవ్, సాయిబాబాగౌడ్, పాండు, సయ్యద్‌ఖాజా, రజాక్, విష్ణువర్ధన్‌రెడ్డి, సుమన్‌గౌడ్ తదితరులున్నారు.

మణికొండ: రాష్ట్రంలో మైనార్టీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుండటంతో వారంతా బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని ఆ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఎంఐఎం పార్టీ గండిపేట మండల అధ్యక్షుడు ముక్తార్‌పాషా, ఆయన 500 మంది అనుచరుల సమక్షంలో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్‌లో చేరారు. ముక్తార్‌పాషా నివాసానికి వెళ్లి ఆయనను పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అన్ని మతాలు, కులాలు, రాష్ట్రాల వారు కలిసి జీవించే వాతావరణాన్ని కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేసిందన్నారు. ఆర్థికంగా వెనకబడి ఉన్న ముస్లింలను ఆదుకోవాలనే ఉద్దేశంతో వారికి అనేక పథకాలు, పాఠశాలలు, ఆర్థికసాయాన్ని అందించి వారికి ఎంతో మేలు చేసిందన్నారు. అన్ని పండుగలను కలిసి సుఖసంతోషాలతో నిర్వహించుకునే వాతావరణం మన హైదరాబాద్‌లో ఉందన్నారు. ఒకరి విశ్వాసాలను మరొకరు గౌరవించుకోవడమే మానవనైజంగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆకర్షితులై 32 ఏళ్లుగా ఎంఐఎం పార్టీలో పనిచేస్తున్న వారే బీఆర్‌ఎస్‌లో చేరడం మంచి పరిణామన్నారు. ఈసారి ఎన్నికల్లో మైనార్టీలంతా బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని నిర్ణయించుకున్నారన్నారు. నార్సింగి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నీలేష్‌ప్రసాద్ తదితరులున్నారు.


నార్సింగిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు


బండ్లగూడ రోడ్‌షోలో..

శంషాబాద్‌లో ఎమ్మెల్యే రోడ్‌షో..

శంషాబాద్: కొత్వాల్‌గూడ వాసులు ఎమ్మెల్యే ప్రసంగానికి ముందు అడ్డుతగిలారు. కొత్వాల్‌గూడలో ప్రధాన సమస్య.. ఎనిమి ప్రాపర్టీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేతో సహా ఇతర నేతలు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. ఎనిమి సమస్య కేంద్రంలో ఉండటంతో పరిష్కారానికి సమయం పడుతుందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. స్థానిక కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

◆ గొల్లపల్లిలో కౌన్సిలర్ చెన్నం అశోక్, జిట్టి సిద్దులు ఎమ్మెల్యేకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి ప్రచారం..

మణికొండ: ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు ప్రజలు ఓటు రూపంలో తమ మద్దతు తెలపాలని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, కౌన్సిలర్ ఉషారాణి, మణికొండ మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి. శ్రీరాములు అన్నారు. మంగళవారం వారు నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో అంశాలను ఇంటింటికీ తిరుగుతూ.. వివరించారు. నియోజవర్గంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేనే గెలిపిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు ఓటు వేయాలని ఇంటింటికీ తిరుగుతూ కోరారు. సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. ఓటర్లను కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కోకాపేట్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

మణికొండ: రాజేంద్రనగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు సి.బీరప్ప, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్ బిక్షపతియాదవ్‌ల ఆధ్వర్యంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉన్నత పథకాలను మేనిఫెస్టో రూపంలో బీజేపీ ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో అత్యధిక సీట్లను సాధించి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఉంటే అభివృద్ధి, సంక్షేమం మరింత సమర్థవంతంగా అందుతుందన్నారు. నాయకులు ఇందిర, నాగేష్, రాఘవరెడ్డి, అనితాదేవి, కుమార్, ఆనందరావు, తమోదన్‌రావు, శంకర్‌సింగ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆవిష్కరణలే కీలకం

సాక్షి, సిటీబ్యూరో: మొక్కల ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి, పంటల ఉత్పత్తి పెంచడానికి వ్యవసాయ ఆవిష్కరణలు కీలకమని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ)లో ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఐసీపీహెచ్ఎమ్)పై సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులో తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి, ఏపీసీ, ఐసీపీహెచ్ఎమ్ వీ.సి.ఎం. రఘునందన్ రావు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా క్షీణిస్తున్న సాగు భూమి మధ్య వ్యవసాయ సవాళ్లను ఎదుర్కోవడంలో ఆవిష్కరణల ద్వారా ప్రయత్నాలను ముమ్మరం చేయాలన్నారు. ఆన్‌లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓఎల్ఎంఎస్)తో పాటు రైతులకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైతు వేదిక వంటి తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. న్యూఢిల్లీలోని ఐసీఏఆర్‌కు చెందిన ప్లాంట్ ప్రొటెక్షన్ – బయోసేఫ్టీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డా.ఎస్.సి.దూబే, ధనూక గ్రూప్ చైర్మన్ ఆర్.జి.అగర్వాల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డీజీ. డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ తదితరులు మాట్లాడారు. ఈ సదస్సు మరో రెండు రోజుల పాటు కొనసాగనుంది.

మాజీ సైనికులకు 'జై జవాన్.. జై కిసాన్' శిక్షణ


మేనేజ్‌లో జై జవాన్ జై కిసాన్ శిక్షణ కోసం వచ్చిన మాజీ సైనికులు

ఏజీవర్సిటీ : మాజీ సైనికుల కోసం రాజేంద్రనగర్‌లోని మేనేజ్‌లో జై జవాన్ జై కిసాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందులో ఆర్మీ, నేవీ, వైమానికదళంలో పనిచేసి పదవీవిరమణ పొందిన మాజీ సైనికులు అగ్రిప్రెన్యూర్లుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని అందించడం మన వ్యవసాయరంగ వృద్ధికి దోహదపడటం లక్ష్యంగా పెట్టుకుని ఈ జై జవాన్ జై కిసాన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్రశేఖర అన్నారు. మేనేజ్‌లో మంగళవారం కొత్త బ్యాచ్‌ని ఆయన ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి 30 మంది మాజీ సైనికులు పాల్గొన్నారని, వీరికి నాల్గు నెలల పాటు శిక్షణను ఇస్తామన్నారు. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని ఇది మూడో బ్యాచ్ అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మాన్యువల్ నుంచి యాంత్రిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయడం జరుగుతుందన్నారు. ఆధునిక పద్ధతుల్లో చేయాల్సిన అవసరాల గురించి వివరించామన్నారు.

సహజ వనరుల సద్వినియోగం


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఏజీవర్సిటీ: భూసారాన్ని పరిరక్షించాలంటే తప్పనిసరిగా సహజ వనరులని సద్వియోగం చేసుకోవాలని దీనిద్వారా ఆహార పౌష్టికాహార భద్రతలను సాధించడం జరుగుతుందని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయలంలో మంగళవారం రామమూర్తి ఐదవ స్మారకోపాన్యాస కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆహార ధాన్యాలు ఉత్పత్తి, ఉత్పాదకతల్లో ఎంతో పురోగతి సాధించినప్పటికీ.. దేశంలో ఇంకా సుమారు 20 శాతం మందికి సరైన ఆహారం దొరకక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎక్కువ శాతం చిన్న పిల్లలు ,మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో నేలల యాజమాన్యం పాత్ర అనే అంశంపై ఈ ఉపన్యాసం నిర్వహించారు. దేశంలో మూడోవంతు ఆహారం వృధా అవుతుండటం దురదృష్టకరమన్నారు. పర్యావరణ పరిరక్షణ వాతావరణ మార్పులు తదితర అంశాలపై ప్రాథమిక విద్య నుంచే విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు.

వ్యర్థాలను వేరుచేసి సేకరించాలి

బండ్లగూడ: వందశాతం చెత్తను వేరుచేసి సేకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం పీరంచెరువు 14వ డివిజన్‌లోని రోడ్ల స్వీపింగ్ పనులను, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీలో చెత్త సేకరణ, 20వ డివిజన్ కాళికానగర్‌లో రోడ్డు స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ప్రతిరోజు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఉదయం 5 గంటలకు రాగానే మెయిన్ రోడ్డును మొదట శుభ్రం చేయాలన్నారు. వాటి తరువాత గల్లీల్లో రోడ్లను శుభ్రం చేయాలన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు సూచించాలని వివరించారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమలను చేపట్టాలన్నారు. ప్రజలను సమన్వయ పరుస్తూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సుభాష్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.


పీరంచెరువులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

ఓటరు స్లిప్పుల పంపిణీ

బండ్లగూడ: ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించుకున్నప్పుడే సమాజం మారుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 30న జరగనున్న పోలింగ్‌లో ఓటుహక్కు వినియోగించుటకు అవసరమైన ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్(వీఐఎస్), ఓటర్ గైడ్ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, వికాస్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సంబంధిత బూత్ లెవ్ ఆఫీసర్స్(బీఎల్ఓ), సూపర్‌వైజర్ ఆఫీసర్స్‌తో వీటిని పంపిణీ చేశారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్(వీఐఎస్)ను తీసుకురావాలన్నారు. ఈ నెల 22న సాయంత్రం 5 గంటల వరకు ఈ స్లిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నారన్నారు.

నాసా కిట్ల పంపిణీ


విద్యార్థులతో ఉపాధ్యాయులు

మణికొండ: శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా కిట్లను పంపిణీ చేశారు. మంగళవారం మణికొండలోని పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి గ్యాస్ట్రోసర్జన్ రాజేష్, కేర్ ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జన్ పద్మిని పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలపై దృష్టి పెట్టి రాణించాలన్నారు. ఈ సందర్భంగా వారు 39మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ అనిత, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ మస్తాన్, నాసా ఇన్‌చార్జ్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

శంషాబాద్ రూరల్: ఆటో చెట్టును ఢీకొని గాయపడిన డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచారం గ్రామానికి చెందిన తాళ్ల నర్సింహ(45) మేనకోడలు పెళ్లి నేపథ్యంలో మద్దూరు వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పనులు చూసుకుని ఈనెల 19 తెల్లవారు జామున ఆటోలో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాయన్నగూడ చౌరస్తా సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని గర్భిణి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: ఉరేసుకుని మూడు నెలల గర్భిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శకాలనీలో నివాసముండే హరిష్ మేనత్త కూతురైన చందన (21)ను నాలుగేళ్లుగా ప్రేమించి పెద్దల సమక్షంలో ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. చందన అత్తాపూర్ శ్రీ చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తోంది. భర్త హరిష్ మెడికల్ రెప్రెజెంటీవ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారు ఉమ్మడి కుటుంబంలోనే ఉంటున్నారు. చందన మూడు నెలల గర్భవతి. రోజు మాదిరిగానే ఉదయం ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం ఇంట్లోకి వచ్చి గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ఇతర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

శంషాబాద్ రూరల్: ఓ మహిళను హత్య చేసిన ఘటనలో నిందితులకు కోర్టు జీవిత ఖైదు విధించింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దగోల్కొండకు చెందిన నక్క మహేష్‌ను 2017లో బంధువులు హత్య చేశారు. ఈ విషయంలో మహేష్ భార్య మంజులకు రూ.3,50,000ల పరిహారం వచ్చింది. ఈ డబ్బుల కోసం మంజుల అత్త శంకరమ్మ, మామ మల్లయ్య, బావ రమేష్ తరచూ గొడవపడుతున్నారు. మానసికంగా, హింసిస్తూ.. వ్యక్తిగత దూషణలు చేశారు. ఈ క్రమంలో 2017 జూలై 25న రాత్రి ముగ్గురు కలిసి మంజుల ఇంటికి వెళ్లారు. ఆమెతో గొడవపడి, ఉద్దేశపూర్వకంగా ఆమెను చంపాలని నిర్ణయించుకుని గొడవకు దిగారు. అంతేకాకుండా మంజులపై కిరోసిన్ పోసి నిప్పటించారు. చుట్టుపక్కల వాళ్లు గమనించి మంజులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జూలై 30న ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ-1 నిందితుడు మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. మంగళవారం జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.సతీష్‌కుమార్ తీర్పును వెలువరించారు. మిగిలిన ఇద్దరు నిందితులు శంకరమ్మ, రమేష్‌కు జీవితఖైదు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించారు.

'అసెంబ్లీలో మాట్లాడని ఎమ్మెల్యే'!


తోకల శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

శంషాబాద్ పట్టణంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి రోడ్‌షో

శంషాబాద్: '' ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన అసెంబ్లీలో పదిహేనేళ్లలో ఒక్కసారి కూడా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నోరు మెదిపిందిలేదని'' బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యేలకు రావాల్సిన ఎస్‌డీపీ నిధులు ఎంత తీసుకొచ్చారో ఎమ్మెల్యే స్పష్టం చేయాలని సవాల్ విసిరారు. పట్టణంలో మున్సిపాలిటీ నిధులు, కేంద్ర నిధులతో వచ్చే పనులకు శంకుస్థాపనలు చేస్తున్న ఆయన ఎమ్మెల్యేగా పూర్తిగా విఫలమయ్యారన్నారు. శంషాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. మరోసారి ఆయన గెలిస్తే ప్రభుత్వ భూములు మచ్చుకైనా కనిపించకుండా పోవడం ఖాయమని ఆరోపించారు. సుపరిపాలన కోసం ప్రజలు కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

◆ పట్టణంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మార్కెట్, బస్టాండ్, ఆసుపత్రి, కళాశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయన యాదవబస్తీ, పోచమ్మగడ్డ, కాపుగడ్డ, సిద్దాంతి, మధురానగర్, ఆర్బీనగర్ తదితర బస్తీల్లో చేసిన రోడ్‌షోకు విశేష స్పందన కనిపించింది. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్, కె.దేవేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎస్సీమోర్చా రాష్ట్ర నాయకులు ప్రశాంత్ తదితరులున్నారు.

బీజేపీలోకి చేరికలు..

మైలార్‌దేవ్‌పల్లి : మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాష్‌గౌడ్ అభివృద్ధిలో వెనుకంజలో ఉన్నాడని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తన నివాసంలో పద్మశాలిపురం బస్తీకి చెందిన 150 మంది ఇతర పార్టీకి చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా తోకల మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రకాష్‌గౌడ్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. దిక్కులేని పరిస్థితులలో ప్రజలు ఓట్లువేసి గెలిపించుకున్నారని దుయ్యబట్టారు. బీజేపీ సీనియర్ నాయకులు చెంరెడ్డి బుచ్చిరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.


శంషాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

తోకలకు మద్దతుగా న్యాయవాది ప్రచారం..

అత్తాపూర్: బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ హైకోర్టు ప్రముఖ న్యాయవాది కురుటి భాస్కర్‌రావు ఎన్నికల ప్రచారం చేశారు. విద్యావంతుడు, యువకుడు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్‌గా 11 ఏళ్లుగా సేవ చేస్తూ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారన్నారు. విద్యావంతులు, మేధావులు, కవులు, కళాకారులు తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సంతోష్ కోలేకర్, దుర్గా ప్రసాద్, రామమూర్తి, దండు లక్ష్మణ్‌రావు, రఘునందన్, సుందర్, దేవిదాస్, రిత్విక్, లక్ష్మీనారాయణ, శక్తి కేంద్ర కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు

నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్

రాజేంద్రనగర్: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ కోరారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో మంగళవారం రోడ్‌షో, ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయన ఈ ప్రచారం చేశారు. గాంధీనగర్ నుంచి ప్రారంభమైన ప్రచారం ఎర్రబోడ వరకు సాగింది. అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ.. స్వాగతం పలికారు. గాంధీనగర్, రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీ, బుద్వేల్, రజక బస్తీ, భగవతిగూడ, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లిలో స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. మూడు దఫాలుగా నియోజకవర్గ ఎమ్మెల్యే విజయం సాధించినా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీయే సుస్థిరమైన పాలన, అభివృద్ధి పనులకు నిధులను అందిస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజేంద్రనగర్ అభివృద్ధి చెందాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. 6 హామీలు ప్రతి గడపకు అందేలా తానే కృషి చేస్తానన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్...

రాజేంద్రనగర్ డివిజన్ మాజీ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ కోరని శ్రీలతా మహాత్మ తన అనుచరులతో మంగళవారం పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కస్తూరి నరేందర్ సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుల రాజకీయాలను ప్రోత్సహిస్తుండటంతో తాము పార్టీ నుంచి బయటికి వచ్చినట్లు తెలిపారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓడిపోయిన అనంతరం దళితులం కావడంతో తమను పక్కన పెట్టారని ఆరోపించారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లిలో పోటీ చేసిన వారు తమ వారు కావడంతో ఎమ్మెల్యే అక్కున చేర్చుకున్నాడని, తమను మాత్రం పార్టీకి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మనస్థాపంతో కాంగ్రెస్‌లో చేరానన్నారు. వనం శ్రీరాంరెడ్డి, కోరని బాల్‌రాజ్, కృష్ణమాచారి, అక్కిరాజు రాధేశ్యామ్, కోరని శ్యామ్, సదాలక్ష్మి, పెండ్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్ షోలో అభివాదం చేస్తూ..

నరేందర్ గెలుపు అభివృద్ధికి మలుపు..

మణికొండ: ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పార్టీ నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా ఉండే వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నికైతే మన ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే మణికొండ మున్సిపల్ చైర్మన్‌గా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, అదే తరహాలో భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తమ ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మాజీ ఎంపీటీసీ రాజు, నాయకులు సాయిరెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, ప్రభావతి, ఇందిర, శివారెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు రాము, వినోద్‌కుమార్, వెంకటేష్ తదితరులున్నారు.


మణికొండలో ఇంటింటి ప్రచారం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కస్తూరి నరేందర్